అతనికి ఆడవాళ్ళతో అట్టే పరిచయంలేదు. అసలు ఆడవాళ్ళంటేనే కాస్త జంకు. అది బయటికి కనపడకుండా, ఏదో వాళ్ళని లెక్కచెయ్యనట్లు మాట్లాడటం అలవరచుకున్నాడు. తల్లికి ఈ విషయం బాగా ఆకళింపుకు వచ్చింది. అందువల్లనే మామూలుగా వచ్చే సంబంధాలకి కొడుకు లొంగడనీ, అంతకన్న రెండాకులు ఎక్కువ చదివిన పిల్ల అయితే, పెళ్ళికి ఒప్పుకుంటాడనీ ఆమె ఉద్దేశం. ఉన్న సిరి సంపదలు అనుభవించేందుకు ఒక చక్కని కోడలు కావాలని ఆమెకోర్కె. శ్యామలనిచూస్తే ఆవిడ కెందుకో చాలా అభిమానం - జాలీ కలిగాయి.

o o o

తెల్లవారి శేఖరం నిద్దర లేవడానికి ముందే శ్యామల తను వచ్చిన పనేమిటో కథ యావత్తూ తల్లికి చెప్పింది. తను వెళ్ళి తనపాట్లు పడతాననీ, అతను లేవకమునుపే వెళ్ళిపోవడం మంచిదనీ చెప్పింది.

శ్యామల సినిమాల్లో చేరేందుకు వచ్చిందని విన్న శేఖరం తల్లి క్షణకాలంపాటు నిర్ఘాంతపోయింది. కాని తనను తాను సంబాళించుకుని అంది.

"దానికేం — అబ్బాయి వెంటవస్తాడు. వెళ్ళి మాట్లాడిరండి. నువ్వు దీనికోసం ఇంట్లోంచి వెళ్ళిపోవాలా ఏమిటి? నీకు ఒక వేషం, ఇంత డబ్బు అని స్థిరపడేదాకా యిక్కడే వుండు. ఆపైన యీ చుట్టుపక్కలే మరో ఇల్లు వెతుకుదాం" అంది నవ్వుతూ.

అయ్యో బాబోయ్. మీ అబ్బాయి వెంట వొద్దు బాబూ! ఆయన కివి గిట్టవనుకుంటాను. నే నొక్కదాన్నే వెళ్ళి వస్తాను" అంది శ్యామల.

"చూడు–నువ్వు చిన్నదానివి. నే చెప్పినట్టు విను. వాడు మిల్లుకి వెళ్ళేముందు నిన్ను తీసుకెళ్తాడు. పని అయిపోతే వెంటనే వెనక్కి తెచ్చి దిగవిడుస్తాడు. లేకపోతే భోజనానికి వచ్చేటప్పుడు తీసుకొస్తాడు. వేడినీళ్లు చల్లారిపోతాయి. తొందరగా స్నానంచేసి రా" అంది శేఖరం తల్లి.

శ్యామల మారు మాటాడకుండా బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

తల్లి ఏం చెప్పిందో ఏమోగాని, శేఖరం శ్యామలకి లెక్చర్లు ఇవ్వకుండా, వేళాకోళం చెయ్యకుండా తీసుకెళ్లాడు. పదిగంటలకి, అంటే వారు వెళ్ళిన అరగంటకి, డైరెక్టరుగారు దర్శనం ఇచ్చారు. ఈమాటా ఆమాటా అయాక, "నీ కెందుకమ్మాయీ సినిమాలు – హాయిగా చదువుకున్న దానివి మరొక ఉద్యోగం చేసుకోక !" అన్నారా డైరెక్టరుగారు.

"ఈసలహాకోసం నేను మూడువందల మైళ్ళు రాలేదు. క్రిందటిఏడు మీరే చెప్తిరిగా - నాలో నటికి కావలసిన లక్షణాలు వున్నాయని. మళ్లీ మీరే వద్దంటారేమిటి?"అంది శ్యామల.

శేఖరం సోఫాలోకూచుని అన్నీ వింటున్నాడు. ఆఫీసు మహా హడావుడిగావుంది. వాళ్ళకి కాఫీలు తెప్పించారు. వచ్చే జనం–పోయేజనం, ఎవరు ఎవరికోసం వస్తున్నారో, అంతు

